క్లుప్తంగా

22న పంచాంగం శ్రవణం

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని 22న బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 4.15 గంటలకు సుప్రభాత సేవ, 4.15 నుంచి 4.30 గంటలకు వరకు శుద్ధి, 5 గంటలకు తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 9.30 నుంచి 10.30 వరకు స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఉత్సవ సమర్పణ, ఉగాది ఆస్థానం, అనంతరం భక్తులను దర్శనభాగ్యం కల్పించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించండి



నాశంపల్లి హౌసింగ్ కాలనీలో సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: జగనన్న హౌసింగ్ కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని జీడీ నెల్లూరు నల్లరాళ్లపల్లి, నాశంపల్లి హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. గ్రామసచివాలయ సిబ్బంది ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే ఉగాది నాటికి ఇళ్లు పూర్తయిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా చేపట్టాలని సూచించారు.

నలుగురికి జైలుశిక్ష



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీస్ సిబ్బంది

నగరి : వేరేవారిపై గొడవకు దిగి వ్యక్తిని గాయపరిచిన కేసులో స్థానిక సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధించారు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు.. 2017లో రంజిత్‌కుమార్, యువరాజ్, హేమంత్‌కుమార్, లక్ష్మి అనేవారు తనపై దాడిచేసి పళ్లురాలిపోయేలా కొట్టారని కొత్తపేటకు చెందిన కేఎస్ వాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అప్పుడు పని చేస్తున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు సోమవారం విచారణకు వచ్చింది. ఏపీపీ ఎం.రామశాంతి కేసులో వాదనలు వినిపించారు. అనంతరం జడ్జి విష్ణువర్మ నిందితుల్లో ఏ1 ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.2500 జరిమానా, ఏ2, ఏ3, ఏ4 ముద్దాయిలకు 3 నెలల జైలు శిక్ష రూ.500 జరిమానా విధించారు. కోర్టు కానిస్టేబుళ్లు నవీన్, మేఘవర్ణం, కోమల ముద్దాయిలను జైలుకు తరలించారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్పందనకు 15 అర్జీలు

శ్రీరంగరాజపురం : స్పందన అర్జీలను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తహసీల్దార్ షబ్బీర్ బాష అధికారులకు ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 15 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 7 మ్యుటేషన్, 6 భూత గాదాలు, 2 శ్మశానానికి రహదారి సౌకర్యం కల్పించాలని అర్జీలు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు, సర్వేయర్లకు సూచించారు.

సిరిమల్లె

- లాభాలు పూయిస్తున్న మల్లెలు
- సిండికేట్ అయిన దళారులు
- పూలరైతులకు ఆదాయం అంతంతమాత్రమే..





తిమ్మాపురంలో మల్లెపూలు కోస్తున్న కూలీలు, (ఇన్‌సెట్) మల్లెలు



తిమ్మాపురంలో సాగైన మల్లెతోట

పుత్తూరు రూరల్: పుత్తూరు ప్రాంత రైతులకు మల్లెపూలు లాభాలు పూయిస్తున్నాయి. మల్లె సాగు లాభదాయకంగా ఉండడంతో రైతులు పూలతోటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. మామూలుగా అయితే పంటలసాగు అంటే పెట్టుబడులతో కూడిన విషయం. కానీ మల్లెసాగుకు పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఏడాదిలో ఏడెనిమిది నెలల పాటు నిరంతరం పూలు కాస్తాయి. దీంతో రైతన్నకు నిరవధికంగా ఆదాయం వచ్చే పంట. దీంతో పుత్తూరు మండలంలో ఏటా ఈ మల్లెతోటలు విస్తరిస్తున్నాయి. కొత్తగా సాగుచేసిన తోట ఓసారి పూతకు వస్తే పదేళ్ల పాటు స్థిరమైన దిగుబడిని ఇస్తుందని పూల రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో 1600 మొక్కలను పెంచవచ్చు. తొలుత గుంతలు తవ్వి ఒక్కో గుంతలో రెండేసి మొక్కలను నాటాలి. మొక్కలు నాటిన తర్వాత తగిన మోతాదులో ఎరువు వేయాలి. మొక్కలకు అంటుకట్టిన ఏడాదిన్నర తర్వాత మొగ్గలు వస్తాయి. మొగ్గలు వచ్చే సమయంలో మందులు పిచికారీ చేయాలి. ఇందుకు ఎకరాకు రూ.16 వేలు వరకు ఖర్చు అవుతుంది. పూలు పూయడం మొదలైన తర్వాత పదేళ్ల పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఈ తోటలకు వారానికి ఒకసారి నీరుకడితే సరిపోతుంది. వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతల వంటి సమస్యలు ఉన్నా మల్లె రైతులకు ఇబ్బంది ఉండదు. మల్లెపూల సీజన్ మార్చి నెలలో మొదలై అక్టోబర్ వరకు ఉంటుంది. తొలి మూడుమాసాల్లో కేజీ రూ.300 నుంచి రూ.500 వరకు ధర పలుకుతాయి. పూలు కోయడానికి వచ్చే కూలీలకు కేజీకి రూ.20 చెల్లిస్తుంటారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్, తిమ్మాపురం, పిళ్లారిపట్టు, కల్యాణపురం, వినాయకపురం ప్రాంతాల్లో మల్లెతోటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. అయితే తాము పండించిన పూలకు తాము ధర నిర్ణయించే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారుల దోపిడీ..

అన్ని మార్కెట్లకు ఉన్నట్లే పూల మార్కెట్‌లోనూ దళారుల దోపిడీ తప్పడం లేదు. పుత్తూరు పట్టణంలో ముగ్గురు పూల వ్యాపారులు ఉన్నారు. వీరు పల్లెల్లోని తోటల వద్దకు తమ సిబ్బందిని పంపించి అక్కడే తూకం వేసి పూలు కొనుగోలు చేస్తారు. ఆ సమయంలో రైతులకు ధర ఎంత అనేది చెప్పకుండా, ఒక పుస్తకంలో ఎన్ని కేజీలు కొనుగోలు చేసింది మాత్రమే నమోదు చేస్తారు. నెలకు ఒకసారి మొత్తం డబ్బు చెల్లిస్తారు. సీజన్ మొదలైన తొలి మూడు మాసాల్లో మంచి ధర ఉన్నా, రైతులకు మాత్రం నామమాత్రపు ధర అందుతుండడంతో దారుణంగా నష్టపోతున్నారు. దళారులు మాత్రం సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరలు నిర్ణయించి వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు దండుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. దళారీ వ్యవస్థను నియంత్రిస్తే పూల రైతులకు తగిన గిట్టుబాటు ధర దక్కుతుంది. ఆ దిశగా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పూల రైతులు కోరుతున్నారు.

సంపూర్ణ ఆహారంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మజ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నగరి : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కీళపట్టు, వీకేఆర్‌పురం, టీఆర్ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ పక్వాడా సంబరాలు ని ర్వహించారు. ఇందులో భాగంగా ఇంటి సందర్శన, ఆహార ప్రదర్శన, తక్కువ ధర న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ కృష్ణవేణి తల్లులకు సంపూర్ణ పోషణ గురించి వివరించారు. ప్రతి దినం ఆహారంలో మిల్లెట్స్ కలిపి తీసుకోవడం వల్ల చక్కటి ఆరోగ్యం లభిస్తుందన్నా రు. పోషణ్ పక్వాడా కార్యక్రమ ప్రణాళిక మార్చి 20 నుంచి ఏప్రిల్ 2023 వరకు వివిధ రకాల కార్యక్రమాలతో నిర్వహిస్తామన్నారు. వీటి ద్వారా తల్లులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.శంకరమ్మ, కె.శ్యామల, జె.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో చక్కటి ఆరోగ్యం

పుత్తూరు రూరల్: చిరు ధాన్యాల ఆహారం తీసుకోవడం ద్వారా శరీరానికి తగిన పోషకాలు అందుతాయని సీడీపీఓ పద్మజ తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, తల్లులు, బాలింతలు విధిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో పోషకాహారంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురంలో..

నగరి (విజయపురం): విజయపురం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషణ ఆవశ్యకతను వివరిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమ ప్రణాళిక మార్చి 20 నుంచి ఏప్రిల్ 2023 వరకు వివిధ రకాల కార్యక్రమాలతో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంఈఓ, మెప్మా ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం : మండలంలో రెవెన్యూ సమస్యలపై స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ బాబు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై స్పందనలో వచ్చిన అర్జీలను రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని హెచ్చరించారు. కులం, ఆదాయం, నివాస సర్టిఫికెట్లను గురించి ప్రతి సచివాలయంలో వచ్చిన వాటిని పరిశీలించి వెంటనే సర్టిఫికెట్లు అందించాలని తెలిపారు. అనంతరం సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేల తీరు జుగుప్సాకరం

వెదురుకుప్పం: శాసనసభలో స్పీకర్‌తో అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దళిత ఎమ్మెల్యేపైనా టీడీపీ ఎమ్మెల్యేలు దాడికి పాల్పడడం అప్రజాస్వామికమని ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం రామయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును ఖండిస్తూ వారు వేర్వేరుగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీ వర్గానికి చెందిన స్పీకర్ తమ్మినేని సీతారాంను, ఎస్సీ వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని, ఎమ్మెల్యే సుధాకర్‌బాబును అసభ్యపదజాలంతో దూషించడం బాధాకరమన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు పిచ్చి ముదిరి ప్రవర్తిస్తున్నారని, అసెంబ్లీ గౌరవాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని ఆరోపించారు. మాజీ సీఎం చంద్రబాబుకు బీసీలు, ఎస్సీలు అంటే చులకనభావం అని, వారిని ఎప్పుడూ తక్కువ చేసి చూస్తూ అవకాశాల కోసం పావులుగా వాడుకుంటారని చెప్పారు. అధికారం లేదనే అక్కసుతో అలజడులు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని టీడీపీ నేతలు చూస్తున్నారని ఆరోపించారు.

రంగునీటి సమస్యను పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కరకంతాపురం గ్రామస్తులు

నగరి : తాగునీటి పారుదల కాలువల్లో డైయింగ్, వాషింగ్ యూనిట్ల నుంచి వచ్చే రంగునీరు ప్రవహిస్తోందని, రంగునీరు రాకుండా సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామానికి చెందిన ప్రజలు విన్నవించారు. దీనిపై వారు సోమవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడే రంగునీరు తాగునీటి పారుదల కాలువల్లో వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య



శిక్షణా తరగతులకు హాజరైన రైతులు

- తిరుపతి రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భాస్కరయ్య
- పుత్తూరులో మామిడి రైతులకు శిక్షణా తరగతులు

పుత్తూరు రూరల్: మామిడి రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల రాయితీలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని తిరుపతి జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పిలుపునిచ్చారు. సోమవారం పుత్తూరు మండలం వేపగుంట, కేబీఆర్‌పురం గ్రామాల్లో మామిడి రైతులకు హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు సంయుక్తంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి చెట్లలో పిందెలు దిగుతున్నాయని ఈ సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బోరాన్ 2 గ్రాముల మందును ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. చెట్లకు ట్రిబుల్ నైన్‌టీన్ కాంప్లెక్స్ ఎరువుతో పాటు మట్టికే ఎరువును సైతం వినియోగించాలని సూచించారు. అలాగే పిందెలపై తామర పురుగు బెడద ఉన్నట్లయితే ఫిప్రోనిల్ 1 ఎంఎల్‌ను ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఫలితంగా నాణ్యత కలిగిన పంటతో పాటు అధిక దిగుబడిని సాధించవచ్చని వివరించారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ సతీష్ మాట్లాడుతూ ప్రతి మామిడి రైతు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పలు లాభాలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను అందిస్తోందని తెలిపారు. ఒక్కోరైతు గరిష్టంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ పొందవచ్చన్నారు. 5 ఎకరాల నుంచి 10 ఎకరాల భూమి కలిగిన రైతులకు 70 శాతంతో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.3.46 లక్షల వరకు రాయితీ పొందవచ్చన్నారు. బిందుసేద్యం ద్వారా నీటితో పాటు ఎరువులను సైతం ఆదా చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

90 శాతం సబ్సిడీ ఇవ్వండి..

5 ఎకరాల రైతుకు ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై ఇస్తున్న 90 శాతం రాయితీని 10 ఎకరాల రైతులకు సైతం ఇవ్వాలని కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ అధ్యక్షుడు కేశవులు కోరారు. అలాగే సస్యరక్షణ నిమిత్తం మామిడి రైతులకు క్రిమిసంహారక మందులు, స్ప్రేయర్లు, ట్రేలు, టార్పాలిన్ పట్టలు, పీవీసీ పైపులను సైతం సబ్సిడీ కింద ఇచ్చి, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు రైతుల సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ఏఓ వేణుగోపాల్, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటసాజన్య, మామిడి రైతులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నెల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన తరగతి గదిలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ప్రశ్నలు వేసి వారి నుంచి జవాబులు రాబట్టారు. పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హెచ్ఎం రమేష్ ఆయన వెంట ఉన్నారు. అనంతరం జెడ్పీసీఈఓ నెల్లేపల్లి గ్రామసచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : వ్యర్థ పదార్థాల్లోని తడి, పొడి చెత్తలను ఉపయోగించుకుని ఎరువులు తయారు చేసి పంచాయతీకి ఆదాయం పెంచాలని ఎంపీడీఓ విద్యావతి అన్నారు. సోమవారం వనదుర్గాపురం పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను ఉపయోగించుకుని ఎరువులు తయారు చేసి వాటిని మనం సాగుచేసే పంటలకు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంటల్లో అధిక దిగుబడి రావాలంటే రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే మంచిదన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్ సహకారంతో తడి, పొడి చెత్తలను వేరు చేసి ఎరువుల తయారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు నగదును అందిస్తున్న సర్పంచ్ చిన్ని

కార్వేటినగరం: మండల పరిధిలోని ఎల్ఆర్ పేట పంచాయతీ వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన జీ.యువరాజ్(45) గత కొనేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ 18వ తేదీ మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద కుటుంబానికి రూ.10 వేలు తక్షణ సాయాన్ని సర్పంచ్ చిన్ని చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేదలకు వైఎస్సార్ బీమాను అందించి అండగా నిలుస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి ద్వారా మిగతా రూ.90 వేలు అందించి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కుప్పువాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, వార్డుమెంబర్ జనార్ధన్, వలంటీర్ మణి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న జీవరత్నం నాయుడు

పాలసముద్రం: ఉన్నత చదువులతోనే విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందగలరని జనవిజ్ఞాన వేదిక సంస్థ నిర్వాహకులు అరుల్ శివప్రసాద్, సుధాకర్ నాయుడు తెలిపారు. సోమవారం వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆముదాల, వీఆర్ కుప్పం, బలిజకండ్రిగ, పాలసముద్రం హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు 'ఉన్నత చదువులు–ఉపాధి అవకాశాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయం విద్యాసంస్థల ప్రిన్సిపల్ జీవరత్నం నాయుడు విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక ఎన్నుకోవలసిన కోర్సులు, తద్వారా ఉపాధి అవకాశాల గురించి వివరించారు. విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులంతా ఐఐటీలు, ఎన్ఐటీలే కాదు 64 కళల్లో ఏదో ఒక కళలో పట్టు సాధించిన రాణించగలమన్నారు. కార్యక్రమంలో వీఆర్ కుప్పం హెచ్ఎం చక్రధర రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలు



బాలకృష్ణాపురంలో వర్షానికి నేలకొరిగిన వరి పంట

పాలసముద్రం : మండలంలో మొత్తం 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల మండలవ్యాప్తంగా వర్షాలు కురిశాయి. వాగులు, వంకల్లో వర్షపు నీరు చేరింది. రెండు నెలలుగా ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో ఇబ్బంది పడుతున్న రైతులు ఈ వర్షంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే కోతదశలో ఉన్న వరి పంటలు వర్షానికి నేలకొరిగాయి. ఇటుక బట్టీలవారు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులకు మామిడి, సపోటతోటల్లోని పూత, పిందెలు రాలిపోయాయి. పలుచోట్ల విద్యుత్ అంతరాయం కలిగింది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ దస్తగిరి

కార్వేటినగరం: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ దస్తగిరి తెలిపారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై బంగారమ్మ ఆలయం సమీపంలో నాకాబందీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని, అలాగే లైసెన్సుతో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పసరిగా ఉండాలని సూచించారు. అదేవిధంగా 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే మాత్రం వారి తల్లిదండ్రులకు కఠిన శిక్ష తప్పదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ఆటోల్లో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించే వారిపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధిస్తామన్నారు. ఏఎస్ఐ మునికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ కొవ్వొత్తుల ర్యాలీ



నింద్రలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న నాయకులు

నింద్ర: తమిళనాడు కృష్ణగిరి జిల్లాలో ఫిబ్రవరి 18వ తేదీన జవాన్‌ను అతి దారుణంగా డీఎంకేకు చెందిన కార్పొరేటర్ హత్య చేయడం దారుణమని నిరసిస్తూ మండల కేంద్రం నింద్రలో బీజేపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయవాది, బీజేపీ నాయకులు మాట్లాడుతూ హత్య జరిగిన 14 రోజుల తరువాత పోలీసులు హంతకుడు పరారైనట్టు చూపించడం ద్వారా, చట్టంపై సామాన్య ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుందన్నారు. దీనిపై డీఎంకే ప్రభుత్వాన్ని తమిళనాడు బీజేపీ నాయకులు, అధ్యక్షుడు అన్నామలై ప్రశ్నించారని, అలాగే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ సంఘటనను నిరసిస్తూ తాము కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. తమిళనాడులో జవాన్ నాయక్‌ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరగకపోతే చట్టపరంగా సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌నాయుడు, దేవా, రవి, మోహన్, రమేష్, గిరి పాల్గొన్నారు.